ఈనాడు పల్నాడు
సోమవారం అక్టోబరు 21, 2024

నేటినుంచి పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు: ఎస్పీ



నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలను 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో విజయవంతం చేయాలని ఎస్పీ కంచి శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఆదివారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నరసరావుపేట కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఏర్పాటు చేసిన పోలీసు అమర వీరుల స్థూపం వద్ద సోమవారం నివాళి అర్పించి, స్మృతి పరేడ్‌తో పాటు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. మావోయిస్టు, ఉగ్రదాడులు, అల్లర్లలో మృతి చెందిన పోలీసు అమరుల స్వగ్రామాలను సందర్శిస్తామని వెల్లడించారు. సైబర్ క్రైమ్ నియంత్రణ, ట్రాఫిక్, రహదారి భద్రతపై యువతకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఓపెన్ హౌస్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఎస్పీ వివరించారు.

పులిచింతలకు వరద ప్రవాహం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో రెండోరోజు ఆదివారం వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం రాత్రి 7 గంటలకు ఏడు రేడియల్ గేట్లు ఎత్తి 2,22,720 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తికి 16,000 క్యూసెక్కులు దిగువకు ప్రకాశం బ్యారేజీకి వెళ్తోందని ఏఈఈ రాజు తెలిపారు. ఎగువ నాగార్జునసాగర్ పరివాహక ప్రాంతం నుంచి 2,39,417 క్యూసెక్కులు వచ్చి చేరిందన్నారు. ప్రాజెక్టులో 39.88 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు.

జిల్లాలో 290.2 మి.మీ. వర్షపాతం

నరసరావుపేట వ్యవసాయం: జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 290.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మాచవరంలో అత్యధికంగా 75.8 మి.మీ వర్షం కురిసింది. మాచర్లలో 29.4, వెల్దుర్తి 14.2, దుర్గి 5.4, గురజాల 1.2, దాచేపల్లి 5.2, కారంపూడి 6.2, పిడుగురాళ్ల 11.2, బెల్లంకొండ 12.8, అచ్చంపేట 40.6, క్రోసూరు 6.8, అమరావతి 5.8, పెదకూరపాడు 5.0, సత్తెనపల్లి 10.8, రాజుపాలెం 2.0, నకరికల్లు 2.8, బొల్లాపల్లి 1.4, వినుకొండ 7.2, నూజండ్ల 12.2, శావల్యాపురం 11.4, ఈపూరు 3.4, రొంపిచర్ల 5.0, నరసరావుపేట 2.4, ముప్పాళ్ల 2.6, చిలకలూరిపేట 2.4, యడ్లపాడు 7.0 మి.మీ. వర్షం కురిసింది.

విజిలెన్స్ విచారణతో హడల్!

- పూర్తిస్థాయిలో దస్త్రాలు ఇచ్చేందుకు మీనమేషాలు
- నాడు ముడుపులు దండుకుని ప్రస్తుతం విలవిల
- అనుకూలంగా చెప్పాలని అధ్యాపకులకు వేడుకోలు
- ఏఎన్‌యూ ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశం



ఈనాడు, అమరావతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత వైకాపా హయాంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా దూర విద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) పీజీ పరీక్షలు, సీడీఈ తదితర అకడమిక్ విభాగాలతో పాటు ఇంజినీరింగ్ విభాగం పనుల్లో అవినీతి పెద్దఎత్తున జరిగింది. ఆయా విభాగాల్లో ఉన్నతాధికారులుగా పనిచేసిన వారిలో కొందరు బాగానే వెనకేసుకుని విజిలెన్స్ విచారణ అనేసరికి కంపెలకు మవుతున్నారు. రూ.కోట్ల విలువైన పనులు టెండర్లు లేకుండా నామినేషన్లపై కట్టబెట్టి గుత్తేదారుల నుంచి కమీషన్ల రూపేణా భారీగా లబ్ధి పొందారు. ఈ వ్యవహారాలపై 'ఈనాడు'లో వచ్చిన వరుస కథనాలకు స్పందించి ఇప్పటికే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో జిల్లా విజిలెన్స్ అధికారులు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పనుల వివరాలను అందజేయాలని వర్సిటీ ఇంజినీర్‌ను కోరగా కొన్ని వివరాలు మాత్రమే ఇచ్చి, మరికొన్నింటిని పంపలేదు. 2019-24 మధ్య చేపట్టిన అన్ని పనుల టెండర్లు, నామినేషన్లపై చేసిన ప్రతి ఒక్క అంచనా వివరాలు, బిల్లులకు సిఫార్సు చేసిన క్వాలిటీ కంట్రోల్ నివేదికలను అందజేయాలని తాజాగా విజిలెన్స్ ఎస్పీ వర్సిటీ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. అయితే పూర్తి స్థాయిలో రికార్డులు ఇవ్వడానికి తర్జనభర్జన పడుతున్నారు. దస్త్రాలే ఇవ్వడం లేదంటే ఏదో మతలబు ఉండి ఉంటుందని విజిలెన్స్ అధికారులు అనుమానిస్తున్నారు.

వైకాపా గులాంగిరీ చేసి..

వైకాపా హయాంలో వర్సిటీ పరిపాలనా పదవుల్లో పనిచేసిన వారు దీనిని అక్రమాలకు నిలయంగా మార్చేశారని విమర్శలున్నాయి. సొంత లబ్ధి చూసుకుని వర్సిటీ నియమ నిబంధనలను పట్టించుకోలేదన్న అపవాదు ఉంది. వైకాపా హయాంలో కొందరు అధ్యాపకులు నాటి ప్రభుత్వ పెద్దల పంచన చేరారు. వారంతా ఇప్పుడు హడలిపోతున్నారు. గత పాలకులు వర్సిటీకి చెందిన సుమారు రూ.60-70 కోట్ల నిధులు కరిగించేశారని, వాటిల్లో అత్యధిక దుబారా పనులే ఉన్నాయని తెలుస్తోంది. 20 అడుగుల వెడల్పు లేని చోట ఉద్దేశపూర్వకంగా కట్టారు. వాటికి రంగులు అద్దారు. న్యాక్ కమిటీ వస్తుందని చెప్పి శిథిలావస్థలో ఉన్న భవనాలకు పెయింట్లు, టైల్స్ అంటించి రూ.కోట్ల నిధులు మంచి నీళ్ల ప్రాయంలా వెచ్చించారు. ఈ క్రమంలోనే నిధులు బాగా దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. వాటన్నింటిపై విచారణ జరుగుతుందని అప్రమత్తమైన నాటి పాలకులు.. విజిలెన్స్ నుంచి మీకు ఎవరైనా ఫోన్లు చేసి స్టేట్‌మెంట్ల కోసం పిలిచినా.. మాకు వ్యతిరేకంగా చెప్పకూడదని వర్సిటీ పరిధిలోని కాలేజీ యాజమాన్యాలు, అధ్యాపకులకు చెబుతున్నారు. ఇది వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

పరీక్షలు పెట్టామని చెప్పండి

వైకాపా హయాంలో వర్సిటీ పరిధిలో మూడేళ్ల పాటు బీఈడీ ప్రయోగ పరీక్షలే నిర్వహించలేదు. విశ్వవిద్యాలయం పరిధిలో 100కు పైగా కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో చదివే అత్యధిక విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు చెందినవారే. ఆయా రాష్ట్రాల నుంచి ప్రాక్టికల్ పరీక్షలు రాయడానికి వచ్చే ఇక్కడ హోటల్లో బస, భోజనాలు, వసతి, పోయేందుకు ఛార్జీలు సగటున ఒక్కో విద్యార్థికి రూ.15 వేల నుంచి రూ.20 వేల దాకా ఖర్చవుతుంది. అందులో సగం సొమ్ము మాకిస్తే వర్సిటీ అధికారులతో లాబీయింగ్ చేసి ప్రాక్టికల్ పరీక్షలు జరపకుండా మేనేజ్ చేస్తామని కాలేజీ యాజమాన్యాలు తొలుత పిల్లల నుంచి సొమ్ము వసూలు చేశాయి. ఆ మొత్తం నుంచి కాలేజీలు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర దాకా వర్సిటీ అధికారులకు ముడుపులు ముట్టజెప్పి వరుసగా మూడేళ్ల పాటు బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించకుండా జాగ్రత్త పడ్డారన్నది బహిరంగ రహస్యమే. అయితే ఈ విషయం నాడు ఉన్నత విద్యామండలి, ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో మా సంగతేమిటని వారు గట్టిగా నిలదీయడంతో కొంత వారికి సమర్పించుకుని ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. మూడేళ్లలో కలిపి రూ.4-5 కోట్ల దాకా వసూలు చేసినట్లు తెలిసింది. అప్పటి ఆరోపణలపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ జరుగుతుందని తెలుసుకుని బీఈడీ పరీక్షల విభాగంలో పనిచేసిన నాటి అధికారి ఒకరు హడావుడిగా బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో పాటు అందులో పనిచేసే అధ్యాపకులకు ఫోన్లు చేసి గతంలో ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయా లేదా అని అడిగే అవకాశం ఉంది. ఒకవేళ ఫోన్ చేసి అడిగినా ప్రాక్టికల్ పరీక్షలు పెట్టామని చెప్పండని బతిమిలాడుతున్నారని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. పరీక్షలు పెట్టినట్లు తాము పక్కాగా షెడ్యూల్ కూడా రూపొందించామని..ఇదిగో ఆ దస్త్రాలివే అని, మీకేం ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. కానీ అధ్యాపకులు అందుకు సమ్మతించలేదని తెలుస్తోంది. మీరు పరీక్ష పెట్టినట్లు షెడ్యూల్ కాపీ అందజేసినా విద్యార్థులకు ఎక్కడ ప్రయోగ పరీక్షలు నిర్వహించారు. వారు ఏ పాఠశాలలో బోధన చేశారు. అందుకు సంబంధించిన సీడీ ఫైల్స్ కోరితే అంతా దొరికి పోతామని కొందరు పరీక్షలు జరిగినట్లు చెప్పలేమని స్పష్టంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంజినీరింగ్ పనులపై మాత్రమే విజిలెన్స్ విచారణ జరుగుతున్నా మిగిలిన విభాగాలు అప్రమత్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. విజిలెన్స్ విచారణకు కొన్ని రికార్డులు కోరారని, వాటిని ఇచ్చే పనిలో ఉన్నామని వర్సిటీ వర్గాలు ధ్రువీకరించాయి.

ప్రధాని మెచ్చిన సర్పంచి

స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతలో మోదీతో భేటీ

పెదకూరపాడు సర్పంచి గుడిపూడి రాజుకు అరుదైన గౌరవం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రం, మేజర్ పంచాయతీ పెదకూరపాడు సర్పంచి గుడిపూడి రాజు గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందడుగేస్తున్నారు. ఊరి బాగుకోసం సొంత నగదుతో పాటు పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. అదే ఆయన్ను ప్రధాని మోదీ మెచ్చుకునేలా, ఆయనతో సమావేశంలో పాల్గొనేలా చేసింది. స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి దశాబ్దం పూర్తయిన సందర్భంగా ఇటీవల దేశంలోని పలువురు సర్పంచులతో ప్రధాని సమావేశం ఏర్పాటు చేయించి సత్కరించారు. ఆ అరుదైన గౌరవం పెదకూరపాడు సర్పంచి గుడిపూడి రాజు దక్కింది.



ప్రధాని నిర్వహించిన సమావేశంలో సర్పంచి రాజు

చెత్తనుంచి సంపద తయారీ, కాల్వల పూడికతీత, పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్ల అభివృద్ధి, ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా చెరువుల తవ్వకం, చెరువుల పూడికలు తీయించడం, పైపులైన్ ద్వారా ఇంటింటికి మంచి నీటిని ఉచితంగా అందించడం, అక్షరాస్యత, పరిశుభ్రత వంటివి సర్పంచి చేపట్టారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం మూడున్నరేళ్లుగా కృషి చేస్తున్న రాజు సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి దశాబ్దం పూర్తయిన సందర్భంగా దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మోదీ అమృత్, అమృత్ 2.0, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, గోబర్ధన్ స్కీమ్ స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతలో ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో పాల్గొనే అవకాశం సర్పంచికి దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది సర్పంచులను సదస్సుకు పిలవగా అందులో పల్నాడు నుంచి పెదకూరపాడు సర్పంచి ఉన్నారు.

అడ్వైజరీ కమిటీలో చోటు: పల్నాడు జిల్లా స్థాయి మానిటరింగ్ అడ్వైజరీ కమిటీలో పెదకూరపాడు సర్పంచి గుడిపూడి రాజుకు చోటు దక్కింది. ఛైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్‌లతోపాటు పెదకూరపాడు సర్పంచి రాజు, సాతులూరు సర్పంచిని సభ్యులుగా ఎంపిక చేశారు.



పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేస్తూ..

సంతోషంగా ఉంది

చిన్నప్పటి నుంచి స్థానిక, రైతు సమస్యలపై అవగాహన ఉంది. బీఏ పూర్తిచేసి ఉద్యోగం వైపు కాకుండా గ్రామాభివృద్ధికి అడుగులు వేశా. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికతో పనిచేస్తున్నా. లాక్‌డౌన్ సమయంలో పేదలకు సొంతంగా నిత్యావసరాలు పంపిణీ చేయటం తృప్తి నిచ్చింది. పెదకూరపాడు నుంచి నన్ను ఎంపిక చేయటం ఆనందంగా ఉంది. ప్రధానితో నేరుగా సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.

\- గుడిపూడి రాజు, సర్పంచి, పెదకూరపాడు

వీఆర్‌కు దాచేపల్లి సీఐ

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావును వీఆర్‌కు పంపించారు. రెండున్నర నెలల కిందట మంగళగిరి టౌన్ నుంచి బదిలీపై దాచేపల్లికి వచ్చారు. అనతికాలంలోనే వీఆర్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. దాచేపల్లి, మాచవరం మండలాల్లో గతంలో కూటమి నాయకులను ఇబ్బంది పెట్టిన వైకాపా నాయకులపై వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కింద స్థాయి సిబ్బందితో ప్రవర్తన తీరు సరిగా లేకపోవడంతో వీఆర్‌కు పంపినట్లు ప్రచారం జరుగుతోంది.

నాలుగు కేంద్రాల్లో టెట్ పరీక్షలు

నరసరావుపేట అర్బన్: జిల్లాలో ఏపీ టెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. నరసరావుపేటలోని నాలుగు కేంద్రాల్లో ఆదివారం పరీక్షలు రెండు విడతలుగా నిర్వహించారు. ఏఎంరెడ్డి స్మారక ఇంజినీరింగ్ కళాశాల, ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 1176 మందికి 987 మంది హాజరయ్యారు. 85 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి : ఏపీటీఎఫ్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా పేర్కొన్నారు. నరసరావుపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా

ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, నూతన ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి పెట్టి జీవో 117 రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం లేకపోవడం బాధాకరమని, తెలుగు మాధ్యమాన్ని తిరిగి ప్రవేశ పెట్టాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర యాప్‌ల విధులు తొలగించాలన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, సయ్యద్ కరీ ముల్లా, గాదె రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అయిదు రీచ్‌లకు ఇసుక టెండర్ల ఖరారు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, నరసరావుపేటటౌన్: జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌ల్లో అయిదింటికి మాత్రమే టెండర్లు ఖరారయ్యాయి. దిడుగు-1 రీచ్‌లో అధిక ధరకు బిడ్ వేయడంతో రీటెండర్‌కు వెళ్లనున్నట్లు జిల్లా మైనింగ్ ఏడీ నాగయ్య ఆదివారం తెలిపారు. ఈనెల 14న కలెక్టర్ అరుణ్‌బాబు సమక్షంలో ఆరు రీచ్‌లకు దాఖలైన బిడ్‌లను పరిశీలించి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తక్కువ పలికిన అయిదింటికి ఖరారు చేశారు. పొందుగుల-2, అంబడిపూడి-1 రీచ్‌లను గోదావరి కృష్ణా వాటర్ వర్క్స్ కంపెనీ వారు రూ.54.99కు, అంబడిపూడి 2ను రూ.89, అంబడిపూడి-3ను రూ.99, కోనూరు-1 రీచ్‌ను రూ.109లకు సాయి, ఎస్ సొల్యూషన్ కంపెనీ దక్కించుకున్నాయి. దిడుగు-1 రీచ్‌ను కూడా సాయి కంపెనీ వారే రూ.125కు బిడ్ వేయడంతో అధికారులు రీటెండర్‌కు వెళ్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.110. కాగా దీనికంటే తక్కువకు బిడ్ వేసిన వారికే రీచ్‌లు కేటాయిస్తున్నారు. కృష్ణానదిలో ప్రస్తుతం వరద ఉండడంతో నీటి ఉద్ధృతి తగ్గాక ఆయా ఇసుక రీచ్‌ల నుంచి తవ్వకాలు ప్రారంభంకానున్నాయి. ఈ రీచ్‌ల్లో 4.23లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నట్లు మైనింగ్ శాఖ ప్రకటించింది. మొత్తం దరఖాస్తులు 36 వచ్చాయి. బిడ్‌లో 21 మంది పాల్గొన్నారు. అందులో తక్కువ ధరకు వేసిన వారికి రీచ్‌లు కేటాయించారు.

రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గం

గుంటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా జి.మోహన్ గోపాలకృష్ణ (రాష్ట్ర సచివాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సి.శంకర్‌నాయక్ (కర్నూలు జిల్లా) కోశాధికారిగా బి.సురేష్‌బాబు (ప్రకాశం), సహాధ్యక్షుడిగా ఏసుబాబు (కృష్ణా), ఉపాధ్యక్షులుగా బి.చిన్నారావు (పశ్చిమ గోదావరి), బి.బ్రహ్మానందరెడ్డి (కర్నూలు), వి.చంద్రశేఖర్ (గుంటూరు), ఎస్.కె.నజీర్ మహమ్మద్ (గుంటూరు), ఎం.సుధాకర్ (చిత్తూరు) ఎన్నికయ్యారు.





ఇది తంగెడ మేజరు కాలువ. దాచేపల్లి మండలంలో 24 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మొత్తం పూడికతో నిండి, నీరు ప్రవహించే మార్గం లేకుండా మూసుకుపోయింది. ఈనెల 10వ తేదీన ఎమ్మెల్యే యరపతినేని పూడికతీత పనులు ప్రారంభించారు. 12 పొక్లెయిన్లు ఏర్పాటు చేసి, 8 రోజులపాటు పూడిక తీయించారు. కట్టలు బలోపేతం చేశారు. 17వ తేదీ నాటికి పనులు పూర్తి చేసి, అదేరోజు కాలువకు నీటిని విడుదల చేశారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కదిలొచ్చారు.. కష్టాలు తీర్చారు!

సాగునీటి కాలువల్లో పూడికతీత

ఎమ్మెల్యే చొరవతో శరవేగంగా పనులు

గురజాల, పిడుగురాళ్ల, దాచేపల్లి, న్యూస్‌టుడే

నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని మేజర్లకు మహర్దశ పట్టింది. గడిచిన అయిదేళ్లుగా తట్ట మట్టి కూడా తీయకపోవడంతో కాలువలన్నీ పిచ్చిమొక్కలు, పూడికతో నిండి రూపుకోల్పోయాయి. నీరు పారక.. పంటలు సాగు చేయలేక అన్నదాతలు నష్టపోయారు. చంద్రబాబు నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సాగునీటి కాలువలపై ప్రత్యేక దృష్టి సారించారు. రైతుల ఇబ్బందులు గుర్తించిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సొంత నిధులతో పూడిక, కంపచెట్లు తొలగించేందుకు నిర్ణయించారు. ఈనెల 10న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి పనులు ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని ఆకురాజుపల్లి, తంగెడ, రామాపురం, దైద, గొట్టిముక్కల మేజరు కాలువల్లో ఒకే రోజు పూడికతీతకు శ్రీకారం చుట్టారు.



పూడిక తొలగించిన తర్వాత ఆకురాజుపల్లి మేజరు కాలువ

పెద్ద సంఖ్యలో యంత్రాలను సమకూర్చి పనులు ముమ్మరంగా చేపట్టారు.

రైతు కమిటీల పర్యవేక్షణ: ఎమ్మెల్యే యరపతినేని పిలుపుతో రైతులు కదిలారు. కమిటీలుగా ఏర్పడి పనులను పర్యవేక్షిస్తున్నారు. రైతు కమిటీల ఆధ్వర్యంలో పనులు శరవేగంతో సాగుతున్నాయి. రాబోయే ఎండాకాలంలో కాలువలకు లైనింగ్ చేయాలని, వీటికి కూడా అంచనాలు రూపొందించి ప్రభుత్వం నుంచి నిధుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు.

లక్ష ఎకరాలకు పైగానే..


గురజాల నియోజకవర్గంలో మేజరు కాలువలు వంద కిలోమీటర్ల మేర విస్తరించాయి. వీటి ద్వారా లక్ష ఎకరాలకుపైగా నీరందేలా తొలినాళ్లలో రూపకల్పన చేశారు. ఆ తర్వాత ఆయకట్టు రెట్టింపయింది. కాలక్రమేణా కాలువల్లో పూడిక నిండిపోవడంతో చివరి భూములకు నీరందడం లేదు. దీనిపై కొన్నేళ్లుగా రైతుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఎమ్మెల్యే చొరవ తీసుకోవడంతో కాలువలకు మహర్దశ పట్టింది. రైతుల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది.

- ఆకురాజుపల్లి మేజరు 22 కిలోమీటర్ల దూరం ఉంది. 6 యంత్రాలు 7 రోజులు పనిచేసి శనివారం సాయంత్రం నాటికి పనులు పూర్తి చేయించారు. రామాపురం మేజరు 21 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా.. శనివారానికి పూడికతీత పూర్తి చేశారు.
- దైద మేజరు కాలువ 21 కిలోమీటర్లు ఉండగా.. చాలావరకు మరమ్మతులు పూర్తికావచ్చాయి. మొత్తమ్మీద అన్ని కాలువల పనులు పూర్తికానున్నాయి.

విజయమే శ్వాసగా..

❖ నృత్యంలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా ఎదిగిన ఈపూరు యువకుడు
❖ పలు పోటీల్లో ప్రదర్శనలతో ప్రశంసలు

ఈపూరు, న్యూస్‌టుడే



డ్యాన్స్ అంటే అతనికి ప్రాణం.. డ్యాన్స్ మాస్టర్ కావాలన్నది కోరిక.. కలను సాకారానికి సాధన చేస్తూ పట్టుదలతో కృషి చేస్తున్నాడు ఈపూరుకు చెందిన యువకుడు బందెల తేజ. డ్యాన్స్ నేర్చుకోవడానికి అతను ప్రత్యేకంగా శిక్షణ తీసుకోలేదు. సామాజిక మాధ్యమాలను చూస్తూ సొంతంగా నేర్చుకున్నాడు. మెళకువలు నేర్చుకుని అంచెలంచెలుగా ఎదుగుతూ ఈటీవీ ఢీ ప్రోగ్రామ్, సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమాలు, ఇతర వేడుకల్లో పాల్గొంటూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతున్నాడు.

అంచెలంచెలుగా ఎదుగుతూ..: తల్లిదండ్రులు కుమార్‌రాజా, వరలక్ష్మి ఉపాధి నిమిత్తం చిలకలూరిపేటలో ఉంటున్నారు. తేజ తల్లిదండ్రుల వద్ద ఉంటూ బీటెక్ వరకు చదువుకున్నాడు. చదువులో ప్రతిభ గల విద్యార్థి అయినా ఉద్యోగం చేయాలని అనుకోలేదు. డ్యాన్స్ మాస్టర్‌గా ఎదగాలన్న లక్ష్యంతో చిన్నప్పటి నుంచే సాధన ప్రారంభించాడు. ఈటీవీ ఢీ కార్యక్రమంలో 'బెజవాడ టైగర్స్' బృందానికి నాయకుడిగా ఉంటూ ఐదేళ్ల నుంచి ఈటీవీ ఢీ, ఛాంపియన్స్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. ఈటీవీ ఢీ-16 సీజన్‌లో 12వ ఎపిసోడ్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొన్న తేజ ఢీ-17, 18 సీజన్లలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా ఎదిగాడు. 2023- 24లో జరిగిన ఢీ-17 సీజన్‌లో డ్యాన్స్ పోటీల్లో విజయం సాధించి ప్రథమ బహుమతి అందుకున్నాడు. అనేక సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమాల్లో ప్రముఖ సినీనటులతో కలిసి డ్యాన్స్ చేశాడు. ప్రముఖ హీరోలు నాని, రామ్ పోతినేని, విశ్వక్సేన్, హీరోయిన్లు హన్సిక, సలోమి ఇంకా బుల్లితెర నటులతో కలిసి వివిధ ఈవెంట్లలో పాల్గొన్నాడు. కన్నడ సినిమాకు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని పని చేశాడు. ప్రస్తుతం సుదర్శన్ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు.

డ్యాన్స్ మాస్టర్ కావాలన్నది నాకల..

నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఇష్టం. ఆరో తరగతి నుంచి నేర్చుకుంటున్నా. 12 సార్లు ఈటీవీ ఢీ డ్యాన్స్ కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు సాధించా. డ్యాన్స్ మాస్టర్ కావాలన్నది నా కోరిక. అందుకు పట్టుదలతో కృషి చేస్తున్నా.

- బందెల తేజ



క్రికెట్ అంటే పిచ్చి

అరవైలో ఇరవైలా ఉండటం అందరికీ సాధ్యం కాదు. అదీ పోలీసు శాఖలో మరీ కష్టం. కాస్త 35 దాటినవారే పొట్టలతో కనిపిస్తుంటారు. అలాంటిది వయసు అరవై దాటినా సరే చలాకీగా విధులు నిర్వర్తిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తన వ్యాయామ, నియమాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.



❖ ఇప్పటికీ రోజూ ఉదయం ఆడుతా
❖ రోజుకో రకం వ్యాయామం చేస్తుంటా
❖ 'ఈనాడు' ముఖాముఖిలో డీఎస్పీ నాగేశ్వరరావు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

రోజూ ఉదయం మూడు గ్లాసుల గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ రసం కలిపి తాగుతా. ఉదయం ఏది వండితే అదీ అల్పాహారం. అన్నీ తింటాను. మధ్యాహ్నం అన్నం కొద్దిగానే తింటాను. రాత్రికి అప్పుడప్పుడు పుల్కాలు తీసుకుంటాను. అన్నం రెండు పూటలా తింటాను. కాకపోతే ఏదైనా సరే పరిమితంగా తింటాను. బరువు ఎప్పుడూ 82 కిలోలకు మించనివ్వను. నాలుగైదు ఏళ్లుగా 82 కిలోల బరువులోనే ఉన్నాను. ఇంకా తగ్గించాలనుకుంటున్నాను. అందుకే ఒక్కోసారి కరివేపాకు, మునగాకు, అల్లం, వెల్లుల్లి మిక్సీ పట్టించి రసం ఒక గ్లాసు తాగి.. ఎండు ఫలాలు తీసుకున్న రోజు అల్పాహారం ఏదీ తీసుకోను. సాయంత్రం తృణధాన్యాలతో రెండు దోశలు తింటున్నాను.

❖ ఉదయం, సాయంత్రం శ్వాస సంబంధిత వ్యాయామాలు చేస్తాను. క్రికెట్ అంటే పిచ్చి. ఒక ఇరవై సంవత్సరాల నుంచి రోజులో గంటైనా సరే క్రికెట్ ఆడకుండా ఉండను. ఎక్కడ ఉన్నా నెట్ పెట్టించుకుని ఆడతాను. గుంటూరులో ఉన్నప్పుడు ఇంటిపైన కూడా నెట్ నిర్మించుకున్నాను. ఇప్పటివరకూ పొగ తాగడం, మద్యం తాగడం లేదు. మాంసాహారంలో అన్నీ తీసుకుంటాను. అయితే ఏదైనా సరే మితంగా తింటాను.

❖ పోలీసులు శిక్షణలో ఉన్నప్పుడు చాలా కసరత్తులు చేస్తారు. మంచి శరీరాకృతి ఉంటుంది. ఎప్పుడైతే విధుల్లోకి వస్తారో వ్యాయామాలకు స్వస్తి పలుకుతారు. విధుల్లో భాగంగా తినే వేళలు మారుతాయి. ఆలస్యంగా తిని విరామం లేకుండా నిద్రపోతారు. దీంతో పూర్తిగా శరీరం మారిపోతుంది. అంతే కాకుండా కానిస్టేబుళ్ల మినహా మిగతా వారు బందోబస్తులు తప్పించి ఎక్కువగా కూర్చునే ఉంటారు. దీంతో ఊబకాయం, పొట్ట పెరుగుతుంది. బిర్యానీ లాంటి వాటికి అలవాటు పడి వ్యాయామాలు చేయక మధుమేహం, రక్తపోటుతో బాధపడుతుంటారు. నిద్రలేని విధులు, చాలా మంది మద్యపానానికి అలవాటు పడతారు. సరే ఇవన్నీ ఉన్నా.. వారంలో మూడు రోజులైనా వ్యాయామానికి కేటాయిస్తే ఇబ్బంది ఉండదు. రోజుకు కనీసం 30 నిమిషాలైనా జాగింగ్ అలవాటు చేసుకోవాలి.



❖ మా పోలీసులందరికీ నేనిచ్చే సలహా ఒకటే.. మితంగా తినడం.. అదీ సాధ్యమైనంత వరకూ వేళకు తినడం.. వ్యాయామం క్రమం తప్పకుండా చేయడం.. ఒత్తిడి తగ్గించుకోవడం.. అప్పుడప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

కాపుల సంక్షేమం, అభ్యున్నతికి తోడ్పాటు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : నరసరావుపేటలో కాపుల సంక్షేమానికి, అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తామని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక జమీందార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత నేత వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపుల అండతోనే కూటమి విజయం సాధించినట్లు తెలిపారు. నరసరావుపేటలో 20 ఏళ్ల తర్వాత తెదేపా గెలుపులో పవన్ కల్యాణ్ నాయకత్వంలోని జనసేన ప్రధానపాత్ర పోషించినట్లు చెప్పారు. కాపు సంఘం కల్యాణ మండం నిర్మాణానికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా పోతుల శంకర్, ప్రధాన కార్యదర్శిగా మంచాల చలపతిరావు, కోశాధికారిగా రామ్మోహన్ బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణం చేసిన కార్యవర్గంతో ఎమ్మెల్యే అరవిందబాబు

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

అనుపులో 10 లక్షల చేప పిల్లల విడుదల

విజయపురిసౌత్ (మాచర్ల), న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం అనుపు వద్ద కృష్ణా జలాల్లో 10 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం పలు పథకాలను తీసుకొచ్చిందని, ఇందులో భాగంగా విజయపురిసౌత్ కాలనీలోని మత్స్యకారులకు వాటర్ ప్లాంట్, అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మాచర్ల-విజయపురిసౌత్ మధ్య రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ. 31 కోట్లతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి సంజీవరావు, తెదేపా మండల అధ్యక్షుడు వీరాస్వామియాదవ్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



అనుపు వద్ద కృష్ణా జలాల్లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, అధికారులు

అర్ధరాత్రి వృద్ధుడి దుర్మరణం

గణపవరం (నాదెండ్ల), న్యూస్‌టుడే : చెన్నై- కోల్‌కత్తా 16వ నంబరు జాతీయ రహదారిపై గణపవరం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చిలకలూరిపేట శారదా జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంతానికి చెందిన ఏలూరి సుబ్బారావు (70) గతంలో కాపలదారు. శనివారం ఉదయం ఇంటి నుంచి గణపవరం వచ్చాడు. అర్ధరాత్రి జాతీయ రహదారి దాటుతుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా అక్కడే దుర్మరణం చెందాడు. అతనికి కుమారుడు, కుమార్తె సంతానం. భార్య గతంలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సమాజ గతిని మార్చడంలో స్వచ్ఛంద సంస్థలు కీలకం



సంఘ సేవకుడు వీరాస్వామిని సత్కరిస్తున్న ప్రతినిధులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సమాజగతిని మార్చడంలో స్వచ్ఛంద సేవాసంస్థల భూమిక కీలకమని తెలంగాణ రాష్ట్ర సీసీఎస్ కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనికుమారి, అటవీశాఖ ఏపీ రాష్ట్ర అధికారి ఎన్.రామచంద్రరావు అన్నారు. స్థానిక హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐఎంఏ హాలులో ఆదివారం జాతీయ సేవా పురస్కారాలను సంఘ సేవకులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సమాజానికి ఎంతో ముఖ్యమన్నారు. ప్రభుత్వాలకు తోడుగా అవి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు దోహదం చేయాలని వక్తలు కోరారు. ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో సామాజిక సేవ చేస్తున్న వివిధ రంగాల సంఘ సేవకులకు మహనీయులు, సేవామూర్తుల పేరుతో జాతీయ అవార్డులను అందజేసి సత్కరించారు. సేవాసంస్థ బాధ్యుడు కంచర్ల బుల్లిబాబు, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రమ్య, మహాలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దొంగల అరెస్ట్

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : బంగారు, వెండి అభరణాలు చోరీ కేసులో ముగ్గురు మహిళలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఎగర్లపల్లి గ్రామానికి చెందిన యర్రసాని సత్యమ్మ, రవాడ సత్యవతి, పటనాల ముత్యాలమ్మ కూలీలు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీళ్లు చోరీలకు అలవాటు పడ్డారు. 8న గుంటూరు పట్టాభిపురానికి చెందిన పానుగోటి సంజన శ్రీలక్ష్మీ తన తల్లిదండ్రుల ఇంటికి నరసరావుపేట వచ్చింది. ఈ సమయంలో బంగారు, వెండి అభరణాలు మార్చుకునేందుకు తండ్రి వెంకట్రావుతో కలిసి శ్రీరాంపురంలో ఓ బంగారు దుకాణానికి వెళ్లింది. అభరణాలు మార్చుకుని దుకాణం నుంచి బయట రావడం చూసిన ముగ్గురు నిందితులు వారి వాహనానికి అడ్డుపడి చేతిలోని హ్యాండ్‌బ్యాగు దొంగలించి ఆటోలో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆదివారం పట్టణంలోని వినుకొండ పై వంతెన సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను తనిఖీ చేసి వారి నుంచి మూడు బంగారు గొలుసులు, మూడు స్టెప్పుల బంగారు గొలుసు, వెండి పట్టీలు, మెట్టెలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. సమావేశంలో సీఐ విజయ్ చరణ్, ఎస్సై వంశీకృష్ణ ఉన్నారు.



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి అభరణాలు

గంజాయి విక్రయిస్తే జైలుకే..

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), : నరసరావుపేట డివిజన్ పరిధిలో గంజాయి విక్రయిస్తే జైలుకు వెళ్లడం ఖాయమని డీఎస్పీ నాగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసుపై ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, మేదరమెట్ల గణేష్ కుమార్, షేక్ సుభాని, సాతినేని అశోక్ కుమార్ మరో ముగ్గురు షేక్ అష్రఫ్, షేక్ షరీఫ్, షేక్ చావపాటి ఉమర్ సాధిక్ జులాయిగా తిరుగుతూ గంజాయి, మద్యానికి బానిసలయ్యారు. వీరంతా కలిసి సులువుగా డబ్బు సంపాదించాలని విశాఖపట్నం నుంచి గంజాయి తీసుకొచ్చి నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. పట్టణంలో రావిపాడు రోడ్డులోని యస్.యస్.యన్. కళాశాల పక్కనున్న హిందూ శ్మశానవాటికలో గంజాయి అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు శనివారం తనిఖీలు చేపట్టగా ఐదుగురు నిందితులు పట్టుబడ్డారని, ముగ్గురు తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. వీరిలో పలువురిపై గతంలో ద్విచక్ర వాహనాల చోరీ కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. నిందితుల వద్ద రూ.35 వేల విలువ చేసే ఏడు కిలోల గంజాయి, రూ.13 లక్షల విలువ గల కారు, ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టు హాజరుపరినట్లు తెలిపారు. మిగతా ముగ్గురిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ విజయ్ చరణ్, ఎస్సై వంశీకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై షేక్ సుమందర్ వలి, కానిస్టేబుళ్లు వీరాంజనేయులు, కోటేశ్వరరావును డీఎస్పీ అభినందించారు.

గమ్యం చేరేలోపే కబళించిన మృత్యువు

● రహదారి ప్రమాదం.. ఒకరి మృతి..
● పది మందికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

బొల్లాపల్లి, వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : మరికొద్ది నిమిషాల్లో గమ్యానికి చేరేలోపే ఆటో రూపంలో మృత్యువు వెంటాడింది. కారును ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనగా దాని వెనకాలే వచ్చిన టాటా ఏస్ మినీ లారీ ఈ రెండింటినీ మీదుగా ముందుకెళ్లి రోడ్డును ఢీకొని ఆగింది. ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం బొల్లాపల్లి మండలం మేళ్లవాగు సమీపంలోని మెండికట్ట వద్ద ఆదివారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కారంపూడి నుంచి ప్రయాణికులతో మేళ్లవాగు వెళ్తున్న ఆటో.. ఇదే మండలం లాలిపురం నుంచి కారంపూడి వైపు వెళ్తున్న కారు మెండికట్ట వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. అదే సమయంలో కారు వెనుకాలే వేగంగా వస్తున్న టాటా ఏస్ మినీలారీ అదుపు తప్పి ప్రమాదం జరిగిన ఆటో, కారును ఢీకొని వాటి పైకి దూసుకుపోయి ముందుకు దూకి రోడ్డును ఢీకొని ఆగింది. దీంతో ప్రమాద తీవ్రత పెరిగింది. కారులో ప్రయాణిస్తున్న కారంపూడి ఆదినారాయణ కాలనీకి చెందిన యువకుడు పేరు బోయిన శివ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో పది మందికి తీవ్ర గాయాలు కాగా వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడిన వారిని నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మూడు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన మూడు వాహనాలు



ఘటనా స్థలిలో శివ మృతదేహం

కేంద్ర వేతన సంఘం సిఫార్సులు వర్తింపజేయాలి

వినుకొండ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు ఏడో వేతన సంఘం సిఫార్సులు వర్తింపజేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కేవీస్ రామకోటేశ్వరావు డిమాండ్ చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘ వినుకొండ బ్రాంచ్ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ 2007 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి స్కేల్ మీదనే పింఛను ఇస్తున్నారని, అప్పటి నుంచి రివైజ్ చేయాలని చెప్పారు. ఇటీవల గుంటూరులో లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ నిర్వహించామని, అందులో కొన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. పుట్టిన తేదీ లేకుండా కేవలం సంవత్సరం ఉన్నవారు ఆధార్, పాన్ ఇతరత్రా ధ్రువపత్రాల ఆధారంగా వాటిని రికార్డుల్లో నమోదు చేయించాలని సూచించారు. అనంతరం వినుకొండ బ్రాంచ్ నూతన అధ్యక్షుడిగా ఈదర సుబ్బారావు, కార్యదర్శిగా సీహెచ్ ఏడుకొండలు పేర్లను ప్రకటించి వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సమావేశంలో సంఘం నాయకులు వై. బాబురావు, నాగశంకర్, ఎ.వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, రహిమాన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి


ఏర్పేడు, న్యూస్‌టుడే: భవనంపై నుంచి కింద పడి కార్మికుడు మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలంలోని ఐఐటీకి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఐఐటీకి సమీపంలో హర్షవర్ధన్‌రెడ్డి నిర్మిస్తున్న 6వ అంతస్తులో ఆదివారం సెంట్రింగ్ పని చేస్తున్న పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరానికి చెందిన మణికంఠ(29) అదుపుతప్పి కింద పడ్డాడు. తోటి కార్మికులు తిరుపతి రుయాకు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రభుత్వ ఆదాయం కంటే ప్రజల అవసరాలే ముఖ్యం : కొమ్మాలపాటి

నరసరావుపేట అర్బన్: రాష్ట్రంలో చంద్రబాబు పాలన ప్రభుత్వ ఆదాయం కంటే ప్రజల అవసరాలు తీర్చడమే ప్రధానమన్న లక్ష్యంతో సాగుతోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. ఇసుక ఉచిత విధానం అమల్లో భాగంగా ప్రజలపై భారాన్ని తొలగిస్తూ సీనరేజిని సైతం రద్దు చేస్తూ సీఎం ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇసుక అవసరమైన వారు సొంత వాహనాల్లో ట్రాక్టర్లపై వచ్చి కూడా తీసుకెళ్లవచ్చని తెలిపారు. వైకాపా పాలకులు గతంలో గుత్తేదారులకు ఇసుక రీచ్‌లు అప్పగించి రూ. వందల కోట్లు లూటీ చేశారని విమర్శించారు. అధిక వర్షాలు, వరదల కారణంగా ఇసుకకు ఏర్పడిన కొరతను నివారిస్తూ సీఎం తీసుకున్న నిర్ణయం కార్మికులకు, గృహనిర్మాణదారులకు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

అమ్మవారికి బంగారు నెక్లెస్

దుర్గి, న్యూస్‌టుడే: పల్నాడులో ప్రసిద్ధిచెందిన శ్రీనిదానంపాటి అమ్మవారికి రెంటచింతల మండలం తుమృకోట గ్రామానికి చెందిన గొర్రెపాటి నారాయణ కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన బంగారు నెక్లెస్‌ను ఆదివారం ఆలయ ఏసీ సైదమ్మబాయికు అందించారు. అనంతరం ఆలయ అర్చకులు దాతలకు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేయించారు.



ఆలయ ఏసీ సైదమ్మబాయికు నెక్లెస్ అందజేస్తున్న దాతలు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 145, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

పట్టభద్రుల ఎన్నికకు ఓటు నమోదు చేసుకోవాలి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి అర్హులైన ప్రతిఒక్కరూ నవంబరు 6 లోపు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ ఆదివారం పేర్కొన్నారు. ఓటు పొందాలనుకునే వారు 2021 నవంబరు 1 నాటికి గ్రాడ్యులేషన్ (డిగ్రీ) గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి పూర్తి చేసి ఉండాలన్నారు. ఆధార్ చిరునామా ఉన్న జిల్లాలో ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేసుకున్నవారు తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాత ఓటర్ల జాబితా రద్దు అవుతోందని, ఎప్పటికప్పుడు కొత్త జాబితాతోనే ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంలో ఆపదలో, అవసరంలో ఉన్నవారికి అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆపన్నహస్తం లభిస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ. 6.91 లక్షల విలువైన చెక్కులను ఆదివారం తెదేపా క్యాంప్ కార్యాలయంలో ఆయన అందజేశారు. అడిగిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు లేదనకుండా సాయం చేస్తున్నారని, ఎంతో మంది చిన్నారులు, విధివంచితులకు ప్రాణదాతగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

? పొలాల్లో ఉన్న విద్యుత్తు నియంత్రికలను దొంగలు పగలకొట్టడం వల్ల పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నాం. కొత్తవి ఏర్పాటు చేయాలి. **-చంద్రయ్య, ఏనుగుపాలెం**

✔ కొత్తగా బాధ్యతలు చేపట్టాను. రెండు రోజుల్లో పరిశీలించి ఉన్నతాధికారుల ద్వారా పరిష్కరిస్తాను.

-శ్రీనివాసరావు, విద్యుత్తు ఏఈ, వినుకొండ రూరల్

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ

యడ్లపాడు, న్యూస్‌టుడే : మండలంలోని కోటలో గ్యార్మీ పండగను ముస్లిం సోదరులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ సుభానీ జెండాను శోభాయమానంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. అన్నదానం చేశారు. సర్పంచి హఫీజ్‌బేగ్, అబ్దుల్, షేక్ అజారుద్దీన్, రామకృష్ణ, గ్రామస్థుపాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం ఎప్పటికో?



పునాదులకే పరిమితమైన భవన నిర్మాణం

నూజండ్ల, న్యూస్‌టుడే : నూజండ్లలో ఐదేళ్ల క్రితం చేపట్టిన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. రూ. కోటితో నిర్మించాలని అప్పటి తెదేపా ప్రభుత్వం నిధులు విడుదల చేయగా 2019లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. తర్వాత ప్రభుత్వం మారగా అప్పటికే 25 శాతం పనులు పూర్తి చేశారు. భవన సామగ్రి తీసుకొచ్చారు. వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయక పనులు నిలిపి వేసింది. గతంలో ఉన్న రెవెన్యూ కార్యాలయ భవనం పడగొట్టగా వేరే భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. పలుమార్లు మండల ప్రజలు, అధికారులు భవన నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

22 నుంచి ప్రత్యేక శిబిరాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలన్నా, పాఠశాలలు, కళాశాలలో చేరాలన్నా, బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు ఇలా ఏది కావాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది లేనిది ఏ పనీ కాదు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోయినా.. అందులో సాంకేతిక తప్పిదాలు ఉన్నా.. తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండాలని, ఇప్పటికే తీసుకుని చాలా కాలమైన వారు నవీకరించుకోవాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా.. చాలామంది ముందుకు రావడం లేదు. ఆధార్ అవసరమైనప్పుడు ఆ ఇబ్బందులేమిటో తెలుస్తుంది. అప్పుడు ఆదరా బాదరాగా పరుగులు తీస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేస్తారు.



ఆధార్ నమోదుకు కనుపాపలు తీస్తున్న నిర్వాహకుడు

గతంలో ఆధార్ కిట్లు సమకూరిన సచివాలయాలు ఈ సేవలను అందిస్తాయి. పదేళ్లుగా వేలిముద్రలు, నిర్ణీత ధ్రువపత్రాలతో ఇతర సమాచారాన్ని నవీకరించుకోని వారు జిల్లాలో వేలమంది ఉన్నట్లు గుర్తించారు.

మంచి అవకాశం

ఆధార్ సేవలు అందుకునేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇది మంచి అవకాశం. వేలిముద్రల నవీకరణతో పాటు ఇతర ఆధార్ సమస్యల పరిష్కారానికి ఇవి దోహదపడతాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆధార్ నవీకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

- వెంకటరెడ్డి, డీఎల్‌డీవో, నరసరావుపేట

సద్వినియోగం చేసుకోవాలి..

ఇంటికి చేరువలోనే శిబిరాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినా సద్వినియోగం చేసుకోవడం లేదు. గతంలో పూర్తిస్థాయి సమాచారం పొందుపరచక చాలావరకు తిరస్కరణకు గురయ్యాయి. గతంలో ప్రత్యేక శిబిరాల్లో నమోదు చేసుకున్న వారు నిర్ణీత ధ్రువపత్రాలు సమర్పించక పోవడం, ఇతరత్రా సాంకేతిక కారణాలతో 5 నుంచి 10 శాతం తిరస్కరణకు గురైనట్లు గుర్తించారు. తర్వాత సిబ్బందికి శిక్షణ అవసరమని తేల్చారు. ఆధార్ కార్డుకు వయసుతో నిమిత్తం లేదు. అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా బాల ఆధార్ తీసుకునే వీలుంది. అయిదేళ్ల లోపు పిల్లల వేలిముద్రలు నిక్షిప్తం కావు. అయిదేళ్లు దాటాక వీరంతా బయోమెట్రిక్ నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన వాళ్లు తమ వేలిముద్రలు, కనుపాపలు పునర్ స్వీకరణ (రీక్యాప్చరింగ్) చేయించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ శిబిరాలు కొత్త ఆధార్ కార్డు నమోదు, వేలిముద్రల నవీకరణ, చిరునామాలు, ఆధార్‌పై వ్యక్తిగత చిత్రం నవీకరణ, చరవాణి సంఖ్య మార్పు, ఇతర దోషాలు సరి చేసుకునేందుకు దోహదపడతాయి.

నేటి నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు



పోలీసు అమరవీరుల ఫ్లెక్సీ వద్ద ఎస్సై బాలకృష్ణ

యడ్లపాడు: ప్రజా సేవలో అసువులు బాసిన రక్షక భటులకు నివాళిగా 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తామని ఎస్సై వి.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల ఫ్లెక్సీలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు.

నేడు ఉచిత డ్రోన్ల కార్యశాల

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ఇండియన్ డ్రోన్ అకాడమీ ఆధ్వర్యంలో ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఉచిత డ్రోన్ కార్యశాల నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. సాంకేతిక రంగంలో డ్రోన్ల తయారీ, వినియోగం ప్రాధాన్యం పెరిగిందన్నారు. దీనిపై కార్యశాలతో పాటు, ప్రదర్శన ఉంటుందని తెలిపారు. జిల్లాలోని సాంకేతిక రంగ విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

పర్యవేక్షణ కరవు.. ఆకతాయిలకు నెలవు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే

చిలకలూరిపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న పాత మార్కెట్ యార్డులో పర్యవేక్షణ కరవైంది. ఆవరణలో ఆకతాయిలు చేరి మద్యం తాగి సీసాలు పగలకొడుతున్నారు. ఖాళీగా ఉన్న గోదాములకు తలుపులు కూడా వేయకపోవడంతో వాటిలోకి వెళ్లి మద్యం తాగుతున్నారు. పలువురు ట్రావెల్స్ నిర్వాహకులు యార్డులోనే పదుల సంఖ్యలో కార్లు నిలుపుతున్నారు. యార్డు ఆవరణ చుట్టూ కూడా పిచ్చిమొక్కలు, వ్యర్థాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి శుభ్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గోదాముల ముందు మద్యం సీసాలు



కార్ల స్టాండ్‌గా మార్కెట్‌యార్డు

నేడు జడ్పీ పాఠశాల వార్షికోత్సవం

చిరుమామిళ్ల (నాదెండ్ల), న్యూస్‌టుడే : చిరుమామిళ్ల శ్రీనడికట్టు రామిరెడ్డి జడ్పీ ఉన్నత, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. హైదరాబాద్ గోల్కొండ హోటల్స్ సంస్థల ఛైర్మన్, దాత నడికట్టు రామిరెడ్డి జన్మదినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఉచితంగా బీఎండీ పరీక్షలు

వినుకొండ, న్యూస్‌టుడే : ప్రపంచ ఆస్టియోపోరోసిస్ డే సందర్భంగా ఆదివారం శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచితంగా ఎముకల దృఢత్వ పరీక్షలు (బీఎండీ) చేశారు. ఈసందర్భంగా పరీక్షలకు హాజరైన వారికి ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ అభిషేక్ ఎముకల దృఢత్వం, పటిష్టతపై అవగాహన కల్పించారు. సుమారు 250 మంది హాజరయ్యారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ కృష్ణకాంత్, మెడికల్ డైరెక్టర్ జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని యల్లమంద, కొండకావూరు, పమిడిమర్రు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన భూమి పూజ చేసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా నిధులు విడుదల చేసి అనేక పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామని చెప్పారు. ఎంపీడీవో కృష్ణకుమారి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు



సీసీ రోడ్డు శిలాఫలకం వద్ద ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, తెదేపా నేతలు

సీసీ రోడ్డుకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన

యడ్లపాడు : ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం మండలంలోని లింగారావుపాలెం సందర్శించారు. బీసీ శ్మశాన వాటిక మార్గంలో రూ. 13 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, ఎంపీడీవో హేమలతాదేవి, తెదేపా నేతలు కామినేని సాయిబాబు, మద్దూరి శ్రీనివాసరెడ్డి, ముద్దన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో కుండపోత వర్షం



మిర్చిపొలంలో వర్షపునీరు



రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో ఇలా..



ఉరకెత్తిన పత్తిపొలం

రొంపిచర్ల, న్యూస్‌టుడే : రొంపిచర్ల మండలాన్ని వరుణుడు వణికించాడు. ఆదివారం మధ్యాహ్నం సుమారు అరగంట ఈదురుగాలులు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం పూట సూర్యుడు వచ్చినా మధ్యాహ్నానికి వాతావరణం మారింది. వర్షం ధాటికి పొలాల్లో నీరు నిలిచాయి. రొంపిచర్ల పాఠశాల అవరణలో వర్షపునీరు నిలిచి చెరువును తలపించాయి. వీరవట్నంలో వాన నీరే మోకాలి లోతున ప్రవహించిందని గ్రామస్థులు తెలిపారు. ఈదురు గాలులకు చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్తు సరఫరా నిలిచింది. సాయంత్రానికి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. వారం నుంచి ఏదో ఒక సమయంలో వర్షం పడుతూ ఉండగా పంటలు దెబ్బతింటాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతల్లో ఆందోళన

పల్నాడులో వారం నుంచి కురుస్తున్న వర్షాలకు మిరప, పత్తి, వరి, అపరాల పంటల్లో నీరు నిలిచాయి. నిత్యం ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తోంది. దీంతో నేల తడి ఆరక నీరు ఎక్కడికక్కడే నిలిచి మిరప మొక్కలు ఉరకెత్తుతున్నాయని రైతులు తెలిపారు. పత్తి పంటలో గూడ, పూత రాలిపోతోందని, తడిసి కాయలు నలుపు రంగులోకి వస్తున్నాయన్నారు. ఇలాగైతే పంట ఎలా పండుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎండ ఉందని భావించే లోపే మబ్బులు కమ్ముకుని వర్షం కురుస్తోంది. రొంపిచర్లలో ఆదివారం గ్రామంలో వర్షం పడగా రాష్ట్రీయ రహదారి పరిధిలోని తంగేడుమల్లి మేజరు వద్ద వాన లేదు. మరో గంట తరువాత తగేడుమల్లి మేజరు వద్ద భారీ వర్షం పడింది.

అంతరాత్మ జ్ఞానమే ఆధ్యాత్మికం



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న శుద్ధ చైతన్యానందస్వామి

వినుకొండ, న్యూస్‌టుడే : మనిషి అంతరాత్మకు సంబంధించిన జ్ఞానమే ఆధ్యాత్మికమని సిద్దేశ్వరం శుద్ధ చైతన్యానంద స్వామిజీ తెలిపారు. పట్టణంలోని సన్నిధి వెంకట ఆంజనేయులు, నాసరమ్మ ధ్యాన మందిరం పునరుద్ధరణ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సత్సంగంలో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుడు చెప్పినట్లు అందరిలోనూ దివ్యాత్మ స్వరూపం ఉందని, దాన్ని గుర్తించి సాధన ద్వారా అనుభవించడమే ఆధ్యాత్మిక జీవితమని చెప్పారు. 33 ఏళ్లుగా ధ్యాన మందిరం సత్సంగాలకు కేంద్రంగా మారడం ఇప్పుడు తిరిగి ఆధునికీకరణ చేసి వినియోగంలోకి తేవడం ఆనందదాయకమని తెలిపారు. అంతకు ముందు సభ్యులు స్వామిజీకి గురుపూజ చేశారు. ధ్యానమందిరం నిర్వాహకులు తెలగంశెట్టి పావనిదేవి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి ప్రాధాన్యం

నాదెండ్ల, న్యూస్‌టుడే : పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, గ్రామాలకు కొత్తరూపు తీసుకొచ్చేలా పల్లె పండగలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నాదెండ్ల మండలం గొరిజవోలు, సంకురాత్రిపాడులో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి ఎంపీ ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

మారథాన్‌లో వినుకొండ యువకుడి ప్రతిభ


వినుకొండ, న్యూస్‌టుడే : శ్రీనగర్‌లో ఆదివారం నిర్వహించిన కశ్మీర్ మారథాన్‌లో వినుకొండకు చెందిన షేక్ అబ్దుల్లా 10వ స్థానంలో నిలిచాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకు మొదలైన అంతర్జాతీయ హాఫ్ మారథాన్‌లో కెన్యా, చైనా, నేపాల్, స్వీడన్, యూఏఈ దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. దేశం నుంచి తనతో పాటు మరికొందరు క్రీడాకారులున్నారని ఆయన తెలిపారు. ఈస్ఫూర్తితో భవిష్యత్తులో ఒలింపిక్స్ పాల్గొనాలన్నదే తన ఆశయమని అబ్దుల్లా తెలిపారు.



హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న అబ్దుల్లా

కంటి వైద్య శిబిరానికి స్పందన

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని రాజాగారికోటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర నేత్ర వైద్యశాల సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా తెదేపా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు, మాజీ సభాపతి కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వైద్యులు 462 మందికి పరీక్షలు చేసి 106 మంది శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధరించారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గత నెలలో శిబిరంలో శస్త్రచికిత్సలు చేయించుకున్న 85 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమాన్ని తెదేపా నేతలు కొల్లి ఆంజనేయులు, న్యాయవాది పంగులూరి ఆంజనేయులు చౌదరి, మందాడి రవి, కొక్కిరాల శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.



కళ్లజోళ్లు అందజేస్తున్న నిర్వాహకులు

అండర్- 14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక

నరసరావుపేట క్రీడలు, రొంపిచర్ల, న్యూస్‌టుడే : రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అండర్- 14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బీఎం సుభానీ ఆదివారం తెలిపారు. 19న పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్-14 జట్ల ఎంపికలో తమ పాఠశాలకు చెందిన బాలుర విభాగంలో ఎ.వరప్రసాద్, జి.సాయి చైతన్య, రిషివర్ధన్, బాలికల విభాగంలో వి.శ్రీదేవి, షేక్ శైలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. వీరు వచ్చే నెల 16 నుంచి చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల తరపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ సైదయ్యను, క్రీడాకారులను హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఏడుకొండలు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.



కార్తీక్‌ను అభినందిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

పురపాలక సంఘ విద్యార్థి ప్రతిభ

పట్టణంలోని ఎస్‌బీఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి డీవీఎస్ కార్తీక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా అండర్- 17 బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అతన్ని డీఈవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం తావుర్యా, పీడీ ఇస్రాయెల్ ప్రసాద్ అభినందించారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : కాయలబండి నడిపే ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు దొంగ లాక్కెళ్లాడు. అర్బన్ సీఐ రమేష్ వివరాల మేరకు.. ఆదివారం పండరీపురానికి చెందిన మునగాల చిన్నమ్మాయి ఎన్ఆర్‌టీ సెంటర్‌లో కాయలబండి నడిపేది. సాయంత్రం కుమారుడిని బండి వద్ద ఉంచి ఇంటికి బయలుదేరింది. ఇంటి వద్ద గేటు తీస్తుండగా వెనుక వచ్చిన గుర్తుతెలియని యువకుడు అశోక ఇల్లు ఇక్కడేనా.. అంటూ ప్రశ్నించాడు. దీంతో ఆమె అతని వైపు తిరిగింది. ఇదే అదనుగా ఆమె మెడలో ఉన్న నాలుగున్నర సవర్ల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్ర వాహనంపై మరో యువకుడితో కలిసి పారిపోయాడు. అర్బన్ సీఐ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు.

అతి వేగంలో మినీ ట్రక్కు బోల్తా

సాతులూరు (నాదెండ్ల), న్యూస్‌టుడే : అనంతపురం- గుంటూరు జాతీయ రహదారిపై ఓ మినీ ట్రక్కు అతివేగంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. గుంటూరు నుంచి గోధుమ పిండి లోడుతో ఆదివారం ట్రక్కు నరసరావుపేట వెళుతోంది. నాదెండ్ల మండలం సాతులూరు వద్దకు రాగానే.. ఎదురొచ్చిన బస్సును తప్పించే క్రమంలో రోడ్డు పక్కనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని బోల్తా కొట్టింది. స్తంభం విరిగి పది మీటర్ల దూరంలో పడిపోయింది. చోదకుడు యూసఫ్ గాయపడ్డాడు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

నలుగురికి తీవ్రగాయాలు

చిలకలూరిపేట గ్రామీణ : మండలంలోని తాతపూడి వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. నరసరావుపేటకు చెందిన సలీం, అబ్దుల్ రహీం, కరీమున్నీసా, సూరిబాబు పాములూరులో శుభకార్యానికి కారులో వెళ్లి తిరిగి వస్తూ ముందుకు లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా.. చిలకలూరిపేట తరలించారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వానికి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి, నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొంతకాలంగా పేదల రేషన్ బియ్యాన్ని వారికి సక్రమంగా సరఫరా చేయకుండా కొంత మంది అడ్డదారుల్లో నల్లబజారుకు తరలించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



మృతి చెందిన సీతారామయ్య

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందాడు. గ్రామస్థుల కథనం మేరకు.. మండలంలోని పమిడిమర్రుకు చెందిన గాలం సీతారామయ్య (55) గ్రామ సమీపంలో గొర్రెలు మేపుతుండగా వర్షం కురుస్తూ పిడుగు పడింది. దాని ప్రభావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సీతారామయ్య మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతుడికి భార్య శేషమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కార్మికులను ఇబ్బంది పెడతారా?

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మున్సిపల్ ఒప్పంద ఉద్యోగులు, కార్మికులను అకారణంగా విధుల నుంచి తొలగించి ఇబ్బందులకు గురి చేయడం పద్ధతి కాదని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ అన్నారు. ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. వీటిని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ కనీస సమాచారం లేకుండా, కారణం చెప్పకుండా విధుల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు. దీక్షలో అల్లాభక్షు, మాబు సుభాని, రమాదేవి, బాషా, పద్మ పాల్గొన్నారు. సాయంత్రం పల్నాడు బాలోత్సవ కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు. పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు తదితరులు మద్దతు తెలిపారు.



రిలే నిరాహార దీక్షలో మున్సిపల్ ఒప్పంద ఉద్యోగులు

సత్తెనపల్లి

•సత్తెనపల్లి •పెదకూరపాడు •మాచర్ల •గురజాల



దుస్తుల పంపిణీలో సీఐ వెంకటబ్రహ్మం, ఏపీపీ నరసింహారావు, సేవకుడు వీరాస్వామి

సామాజిక సేవతో ఆత్మసంతృప్తి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆత్మసంతృప్తిని అందించే సామాజిక సేవకు ప్రతిఒక్కరూ కదలాలని గుంటూరు ఇంటలిజెన్స్ సీఐ అవ్వారు వెంకట బ్రహ్మం అన్నారు. పట్టణంలోని ఫణిదం చేనేత సొసైటీ కాలనీలో ఆదివారం సామాజిక సేవకుడు గంజి వీరాస్వామి ఆధ్వర్యంలో 20 మంది నిరుపేద చిన్నారులకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేశారు. ఏపీపీ నరసింహారావు, సొసైటీ సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తెదేపా నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: త్వరలో జరిగే గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎన్నికలో ఓటు హక్కు వినియోగానికి పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కంబాల వెంకటేశ్వరరావు, లీగల్‌సెల్ నియోజకవర్గ కన్వీనర్ ఎంవీ చలపతిరావు అన్నారు. పట్టణంలోని నాగార్జునానగర్‌లో ఆదివారం పట్టభద్రుల ఓటుహక్కు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫారం-18లను పట్టభద్రులకు అందజేశారు.

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించాలని యరపతినేని సాయినిఖిల్ చెప్పారు. ఆదివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఓటు నమోదు చేయించాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు వీరస్వామి, సర్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? ధరణికోటలోని కృష్ణానది ఒడ్డున శ్మశానం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. **- రామయ్య, ధరణికోట**

✔ సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- వెంకటాద్రి, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, అమరావతి

అద్దె భవనాలపై ప్రేమెందుకో?

ఉద్యోగులకు తప్పని అగచాట్లు

ఏళ్లతరబడి పరాయి పంచనే..

అమరావతి, పెదకూరపాడు, బెల్లంకొండ, న్యూస్‌టుడే:

నియోజకవర్గం కేంద్రం పెదకూరపాడుతోపాటు అమరావతిలోనూ పలు ప్రభుత్వశాఖలకు సొంత భవనాలు లేవు. ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. అద్దె రూపంలో ప్రభుత్వ సొమ్ము చెల్లిస్తూ కాలం గడుపుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలన్న ఆలోచన చేయడం లేదు. కొన్నింటికి భవనాలు నిర్మించినా అందుబాటులోకి తీసుకురాకుండా అద్దె గదులపైనే మక్కువ చూపుతున్నారు. అమరావతి, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాల్లో 'వెలుగు'కు సొంత భవనాలు లేవు. నియోజకవర్గంలో సమారు ఆరు వేల స్వయం సహాయక గ్రూపులున్నాయి. సిబ్బందితోపాటు మహిళల సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో స్త్రీశక్తి భవనాలు మంజూరు చేసినా.. పనులు అర్ధంతరంగా నిలిపేశారు.

ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి..

❒ అమరావతి మండల వెలుగు కార్యాలయ సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం ఎక్కడ ప్రభుత్వ కార్యాలయం ఖాళీగా ఉంటే అక్కడకు మారుతుంటారు. ఆ భవనాలు సంబంధిత శాఖకు అవసరమైనప్పుడు ఖాళీ చేయాల్సి వస్తోంది. 2008లో అప్పటి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ వెలుగు కార్యాలయానికి ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఒక్క అడుగు ముందుకు పడలేదు. కొన్ని రోజులు గ్రామ కల్‌రీలో కార్యాలయం, ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో అద్దె భవనంలోకి వెలుగు సిబ్బంది మారారు. తాజాగా సచివాలయం-2 పైఅంతస్తులో విధులు నిర్వహిస్తున్నారు.

❒ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అమరావతికి కేటాయించినా.. ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదు. నెలకు రూ.8 వేలు చొప్పున అద్దె చెల్లిస్తూ ప్రైవేటు భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు.

❒ మండల వ్యవసాయాధికారి కార్యాలయం లేకపోవడంతో ధరణికోట రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. కార్మికశాఖ పరిస్థితి అంతే. అద్దె భవనంలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

❒ పెదకూరపాడులో 2008లో రూ.12 లక్షలతో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలుగు కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. అయితే ఆ భవనం పోలీస్‌శాఖ పరిధిలో ఉందంటూ దాన్ని వెలుగు శాఖకు అప్పగించడం లేదు.

❒ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. రూ.వేలు అద్దె చెల్లిస్తున్నారు.

❒ బెల్లంకొండ మండలంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నా సొంత భవన నిర్మాణాలు చేపట్టలేదు. వెలుగు కార్యాలయం పంచాయతీ భవనంలో ఉంది. దేవాదాయశాఖ, పోస్టల్ కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.



ప్రైవేటు భవనంలో అమరావతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



పెదకూరపాడులోని అద్దె భవనంలో ఎక్సైజ్ కార్యాలయం

రూ.24.45 లక్షల సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

కారంపూడి, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు రూ.24.45 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు వైద్య ఖర్చులకు ఇబ్బంది పడకూడదని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయనిధి ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని వేపకంపల్లె, గాదెవారి పల్లె, పెదకొదమగుండ్ల గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. పల్లెల ప్రగతితో రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

రెంటచింతల: పేదలకు కార్పొరేట్ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే సీఎం సహాయనిధి పథకం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. రెంటచింతల, మంచికల్లుకు చెందిన లక్ష్మమ్మ, కొండలుకు రూ.2,72,278 అందజేశారు.

'ఊర్లో ఉండాలంటే సొమ్ము చెల్లించాలి'

ఓ కానిస్టేబుల్ బేరం పెట్టినట్లు తెదేపా కార్యకర్త ఆరోపణ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: వైకాపా నేతల పేరు చెప్పి ఓ కానిస్టేబుల్ డబ్బు వసూలు చేశారంటూ మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త సత్తార్ ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 'గత వైకాపా ప్రభుత్వ హయాంలో వేధింపులు ఎక్కువయ్యాయని, గ్రామంలో ఉండాలంటే వైకాపా నేతలకు డబ్బు ముట్టజెప్పాలని ఓ కానిస్టేబుల్ బేరం పెట్టారు. పలుమార్లు స్టేషన్‌కు పిలిపించి రూ.లక్ష చెల్లించాలని డిమాండు చేశారు. దీంతో రూ.90 వేలు నగదు అందించి, మరో రూ.పది వేలు తన బావమరిది ఫోన్ ద్వారా ఫోన్‌పే చేశాను. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని గ్రామానికి చెందిన వైకాపా నేతలను కోరాను. తాము డబ్బు తీసుకోలేదని చెప్పారు. కానిస్టేబుల్‌ను అడగ్గా నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో ఎస్పైను కలిసి న్యాయం చేయాలని వేడుకున్నట్లు' బాధితుడు వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బాధితుడు సత్తార్ పేర్కొన్నారు. దీనిపై సదరు కానిస్టేబుల్‌ను వివరణ అడగ్గా.. ఇంటి నిర్మాణ విషయంలో సత్తార్‌పై ఫిర్యాదు రావడంతో పెద్దలు రాజీ కుదిర్చారని, ఆ మేరకు రూ.లక్ష ఫిర్యాదుదారుడికి ఇచ్చారన్నారు. దీనికి రాజకీయ రంగు పులుముతున్నారని పేర్కొన్నారు.

కొమెరపూడిలో పోలీసుల సోదాలు



గ్రామంలో డీఎస్పీ హనుమంతరావు తదితరులు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి కొమెరపూడిలో డీఎస్పీ ఎం.హనుమంతరావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఆదివారం సోదాలు నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి గ్రామాన్ని జల్లెడ పట్టారు. సుమారు నాలుగు గంటలకుపైగా సిబ్బంది తనిఖీలు చేశారు. సరైన పత్రాలులేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఖాళీ స్థలాలు, దిబ్బలు, శిథిల భవంతులు, వాటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని ఇళ్ల డాబాలపై నిల్వ చేసిన సామగ్రిని గమనించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే, ప్రోత్సహించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ స్థానికులను హెచ్చరించారు. సీఐలు పి.శ్రీనివాసరావు, బి.బ్రహ్మయ్య, పి.సురేష్, ఎం.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సిరంజీల కొరత

రాజుపాలెం, న్యూస్‌టుడే: రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్సులిన్ సిరంజీల కొరత ఏర్పడింది. కుక్క, కోతి వంటి జంతువులు కరవటంతో రేబిస్ వ్యాక్సిన్ కోసం ఆసుపత్రికి వచ్చే బాధితులకు సిబ్బంది సిరంజీలు లేవని సమాధానం ఇస్తున్నారు. దుకాణాల్లో కొనుగోలు చేసి తీసుకు వస్తే టీకా వేస్తామని చీటీలు రాసి ఇస్తున్నారు. సుమారు నెల రోజుల నుంచి కొరత ఉందని రోగులు చెబుతున్నారు.

అధ్యాపకుడికి కలాం పురస్కారం



కె.ఎస్.లక్ష్మణరావు నుంచి అవార్డు అందుకుంటున్న సురేష్‌కుమార్

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ పురస్కార అవార్డును విద్యార్థి కళాశాల డైరెక్టరు ఎం.సురేష్‌కుమార్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అందజేశారు. సదరన్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారు ఈ అవార్డును అందజేశారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

మాచర్ల (కారంపూడి): స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపటంపై హర్షం ప్రకటిస్తూ మాచర్ల పట్టణ స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వేణు, శ్రీనివాసాచారి, భాస్కరాచారి, కాశీపతి, రవిబాబు, కృష్ణ, అప్పాచారి, బ్రహ్మం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులపై ఫిర్యాదు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఫేస్‌బుక్‌లో అనుచిత పోస్టులు చేసిన వ్యక్తితోపాటు అతడిని ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది కొమ్మిశెట్టి వెంకటసాంబశివరావు ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పల్లె పండగ కార్యక్రమంలో మాజీ వైకాపా నాయకుడు, గుత్తేదారు నాగేశ్వరరావు పాల్గొని శంకుస్థాపనలు చేయడాన్ని ఫేస్‌బుక్‌లో తాను ప్రజాస్వామ్యయుతంగా తప్పుపట్టానన్నారు. దీంతో నాగేశ్వరరావు తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఫొటోతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ ఓపెన్ చేయించి యెల్లినేడి రమేష్‌చౌదరి పేరుతో అసభ్య పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో తనను దూషించారన్నారు. జనసేన పార్టీ ప్రతిష్ఠ వారు దిగజార్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భర్తపై భార్య దాడి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: విభేదాల కారణంగా నిద్రిస్తున్న భర్తపై భార్య దాడిచేసి గాయపరిచిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గుండ్లపాడు గ్రామానికి చెందిన అదిరాల సాగర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో నిత్యం ఇంట్లో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం సాగర్ మద్యం తాగి ఇంటికి వచ్చి, భార్యతో గొడవపడ్డాడు. అనంతరం నిద్రిస్తున్న భర్తపై భార్య మరియమ్మ కర్రతో తలపై దాడి చేసి గాయపరిచింది.

చెరువులో మృతదేహం లభ్యం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై ఇంటి నుంచి ఎనిమిదిరోజుల కిందట వెళ్లిన వ్యక్తి మృతదేహం జానపాడు శివారులోని చెరువులో ఆదివారం బయటపడింది. పోలీసుల వివరాల ప్రకారం జానపాడు గ్రామానికి చెందిన సుబ్బారావు(44) మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఈలోగా చెరువులో అతడి మృతదేహం బయటపడినట్లు ఎస్సై మోహన్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

దాచేపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గుంటూరులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కారంపూడి మండలానికి చెందిన రామయ్య (40) గేదెలకు పెరిగిన కొమ్ములు కోస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం లింగయ్యతో కలిసి పొందుగల నుంచి కారంపూడి వైపు వెళుతుండగా పాల లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రామయ్యకు తీవ్ర గాయాలుకాగా.. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఉదయం తెరిచారు.. సాయంత్రం మూయించారు

రాజుపాలెం, న్యూస్‌టుడే: రాజుపాలెంలో నూతనంగా ప్రారంభించిన మద్యం దుకాణంపై తెలుగు తమ్ముళ్ల అధికార బలం ప్రదర్శించారు. లాటరీ ద్వారా ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యక్తి శనివారం దుకాణాన్ని ప్రారంభించారు. అయితే మండలానికి చెందిన కొందరు నాయకులు అక్కడకు చేరుకుని అమ్మకాలు నిలిపివేయాలని సిబ్బందికి చెప్పారు. అనంతరం దుకాణ యజమానితో చరవాణిలో మాట్లాడి, వ్యాపార నిర్వహణలో తమకు భాగస్వామ్యం ఇవ్వాలని కోరారు. సదరు యజమాని ససేమిరా అనడంతో విషయాన్ని నియోజకవర్గ ప్రజాప్రతినిధి వద్ద తేల్చుకుందామని, అప్పటివరకు అమ్మకాలు నిలిపివేయాలని హుకుం జారీ చేశారు. ప్రారంభించిన కొద్ది గంటల్లోనే దుకాణం మూయించారు.

సీపీఎం కార్యవర్గ ఎన్నిక

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: సీపీఎం మాచర్ల ఏరియా నూతన కార్యవర్గాన్ని 8వ మహాసభలను పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఏరియా కార్యదర్శిగా బండ్ల మహేష్, సభ్యులుగా కొత్త వెంకటరత్నం, సురేష్, నాగేశ్వరరావు, రాజు, రామయ్య, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

నేడు క్రోసూరులో ప్రజాదర్బార్

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రజాదర్బార్ నిర్వహిస్తారని నాయకులు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

కొత్తపల్లి(అచ్చంపేట): మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఆనంద్‌కుమార్‌కు ల్యాప్‌టాప్, శిక్షణ నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు ప్రతినిధి కుంచనపల్లి కిరణ్ తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణారావు, ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు.

అసమానతలు నిర్మూలిద్దాం

రెంటచింతల, న్యూస్‌టుడే: గ్రామాల్లో సామాజిక అసమానతల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని న్యాయవాది ప్రభుదాస్ అన్నారు. ఆదివారం రెంటచింతలలో జరిగిన కార్డ్స్ సేవాసంస్థ బాలబాట ఆర్గనైజర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ అమర్నాథ్, నందనాయక్, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: కొత్త ఆధార్ కార్డుల నమోదుకు ఈనెల 22 నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమారెడ్డి తెలిపారు. బెల్లంకొండ, చిట్యాల, చంద్రజుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

దాచేపల్లి, న్యూస్‌టుడే: చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను దాచేపల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇటీవల దాచేపల్లి, తంగెడ గ్రామాల్లో ఆరు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. మాచవరం మండలం చెన్నాయపాలెం చెందిన పవన్ కల్యాణ్, శివరామకృష్ణ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఏ పెచ్చు ఎవరిపై పడుతుందో?

శిథిలావస్థలో వసతి గృహ భవనం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాలలోని బాలికల వసతి గృహానికి ప్రత్యేక గుర్తింపు ఇంది. ఇక్కడ వందల సంఖ్యలో బాలికలు చదివారు. ఎంతోమంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. 1983లో నిర్మించిన వసతి గృహ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతోపాటు పలు సమస్యలు తిష్టవేశాయి. దీంతో ఇక్కడ చేరే విద్యార్థినుల సంఖ్య నానాటికీ తగ్గుతోంది. ఇప్పుడు 60 మంది బాలికలు ఉన్నారు. వీరంతా పలు సమస్యలతో సతమతమవుతూ సర్దుకుపోతున్నారు. వర్షాలకు భవనం పైకప్పు కారుతోంది. పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బాలికలు భయాందోళన చెందుతున్నారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారి పక్కనే ఉన్న పాఠశాల గదుల్లోకి విద్యార్థినులను తరలిస్తున్నారు. వసతి గృహంలో 5 గదులు ఉండగా.. ఒకటి పూర్తిగా శిథిలం కావడంతో మూసేశారు. మిగతా నాలుగింటిలో గదికి 15 నుంచి 20 మంది విద్యార్థినులు ఉంటున్నారు. మరో వైపు వసతి గృహ ఆవరణ అపరిశుభ్రంగా మారింది. వర్షపు నీరు ప్రాంగణంలో నిలిచి, దోమల ఆవాసంగా మారుతోంది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి నూతన వసతి గృహ భవనాన్ని నిర్మించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఏఎస్‌డబ్ల్యూ సుజాత కుమారి మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు వెళ్లినట్లు చెప్పారు.



శిథిలావస్థకు చేరిన బాలికల వసతి గృహం



ఊడిన పైకప్పు పెచ్చులు

పాఠశాలల నిర్వహణకు నిధులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నిర్వహణకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. గత రెండేళ్లుగా నిధులు మంజూరవ్వక ప్రధానోపాధ్యాయులు సొంత నగదు ఖర్చు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలతోపాటు పాఠశాలల సందర్శనకు వెళ్లిన సమయంలో సుద్దముక్క కొనుగోలుకు సైతం డబ్బుల్లేవని ఉపాధ్యాయులు చెప్పడంతో విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన జిల్లాలోని 38 విద్యాలయాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు కేటాయించారు. 0 నుంచి 100 మందిలోపు విద్యార్థులుంటే రూ.50 వేలు, 101 నుంచి 250 మందిలోపు ఉంటే రూ.75 వేలు, 251 నుంచి వెయ్యి మంది విద్యార్థులకు రూ.లక్ష, వెయ్యిమందికి పైబడి ఉంటే రూ.1.50 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: శ్రీకేతవరం లక్ష్మీనృసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1,11,000 ఆర్థిక సాయం అందించినట్లు అర్చకుడు ప్రసన్న కుమార్ తెలిపారు. తంగెడ గ్రామానికి చెందిన పాశం అంజిరెడ్డి దంపతుల కుమారుడు సాయి నరసింహారెడ్డి (యూఎస్‌ఏ) విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

యువకుడి ఆచూకీకి గాలింపు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: గుత్తికొండ సమీపంలో గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో శ్రీనివాసరావు స్నానం చేస్తూ శనివారం గల్లంతయ్యాడు. అతడి జాడకోసం పోలీసులు, కుటుంబ సభ్యులు ఆదివారం గాలించారు. యువకుడి జాడ తెలియలేదని పోలీసులు తెలిపారు.

చౌక దుకాణాల పునర్విభజనకు చర్యలు



దుకాణంలో సరకులు తీసుకుంటున్న కార్డుదారులు (పాత చిత్రం)

సత్తెనపల్లి, మాచర్ల, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పకడ్బందీగా ప్రజలకు చేరువ చేసే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చౌక దుకాణాల పునర్విభజన, క్రమబద్ధీకరణ, ఖాళీల భర్తీ, కొత్త దుకాణాల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. జిల్లాలో 800 కంటే అధికంగా కార్డులు ఉన్న దుకాణాల డీలర్లకు అభ్యంతరాలు తెలియజేయాలని నోటీసులు జారీ చేశారు. జిల్లాలో 1289 రేషన్ దుకాణాలు ఉండగా.. వీటి పరిధిలో 6,45,110 కార్డులు ఉన్నాయి. గ్రామాల్లో 400-450, పట్టణాల్లో 500-550, నగరాల్లో 600-650 కార్డులు ఉంటే.. ఆ పరిధిలో దుకాణం ఏర్పాటు చేశారు. 800 కంటే ఎక్కువ కార్డులున్నవి 80 దుకాణాలు ఉన్నాయి.

షెడ్యూలు ఇలా..

- ◆ కొత్త దుకాణాలు, ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల: ఈనెల 20
- ◆ రాత పరీక్ష: నవంబరు 5
- ◆ ముఖాముఖి: 7
- ◆ నియామక ఉత్తర్వులు అందజేసేది: 10
- ◆ నియామక ప్రక్రియ పూర్తి: 15
- ◆ సరకుల పంపిణీ: డిసెంబరు నుంచి

నడకకూ కష్టమే



కొత్తపేటలో..



వాసవినగర్‌లో అంతర్గత రోడ్డు దుస్థితి

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు చిత్తడిగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చకపోవడంతో వాటిలో వర్షపు నిలిచి రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. నడకకు సైతం ఇబ్బందిగా అంతర్గత రోడ్లు మారాయి. మరమ్మతులతోపాటు శాశ్వత రోడ్ల నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

కంకరతో నిండి..



గుంటూరు-మాచర్ల రహదారి నుంచి చౌటపాపాయపాలెం వెళ్లే రహదారి పనులు ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 1.2 కి.మీ దూరం ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. గుత్తేదారు వెట్‌మిక్స్ వేసి చదును చేశారు. అంతలో అప్పటి నియోజకవర్గ ప్రజాప్రతినిధికి గుత్తేదారుతో విభేదాలు తలెత్తటంతో పనులు నిలిపివేశారు. ప్రస్తుతం కంకర రాళ్లు లేచి నడవటానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, రాజుపాలెం**

డొంక దారిపై వెళ్లేదెలా?



క్రోసూరు మండలం అందుకూరు-గోరంట్ల డొంక రహదారి అధ్వానస్థితిలో ఉంది. అందుకూరు నుంచి గోరంట్ల మధ్య దారి బురదమయమైంది. ముళ్లు, కంప చెట్లు పెరిగి మూసి వేయబడి పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. వ్యవసాయ పనులకు నిరంతరం ఈ రహదారి నుంచే వెళ్లాలి. గోరంట్ల గ్రామస్థులు క్రోసూరుకు ఇదే మార్గంలో ప్రయాణించాలి. **- న్యూస్‌టుడే, క్రోసూరు (అచ్చంపేట)**

పగుళ్లిచ్చి.. కుంగి..



సత్తెనపల్లి మండలం కంటెపూడిలోని ఎస్సీకాలనీలో కల్వర్టు, సిమెంటు రహదారి దుస్థితి ఇది. సీసీరోడ్డు పగుళ్లిచ్చి కుంగిపోగా కల్వర్టు మీదుగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ వీధి గుండా కట్టావారిపాలెం వైపు వెళ్లాల్సిన ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కుంగిపోయిన సీసీ రోడ్డు స్థానంలో కొత్తగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ**